సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం । 26 । జనవరి । 2024



గాలికుంటు టీకా.. భయం లేదిక

పశువుల వ్యాధుల నివారణకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు ఉచితంగా టీకాలు వేయిస్తోంది.

II లో




1.98 కోట్ల మంది కులగణన పూర్తి

కులగణన ప్రక్రియ చేపట్టిన వారం రోజుల్లో 89 లక్షల కుటుంబాల్లోని 1.98 కోట్ల మందికి ఈ ప్రక్రియ పూర్తి చేశామని మంత్రి చెల్లుబోయిన వేణు తెలిపారు.

II లో

డెల్టాలకు 10,950 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు గురువారం 10,950 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,150, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.45 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

- నేడు అమలాపురం స్టేడియంలో సంబరం
- సిద్ధమవుతున్న శకటాలు
- ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు



విద్యుద్దీప కాంతుల్లో కలెక్టరేట్

సాక్షి అమలాపురం: భారత గణతంత్ర వేడుకలకు జిల్లా కేంద్రం అమలాపురం ముస్తాబయింది. స్థానిక క్రీడాప్రాంగణంలో వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నారు. ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేసిన తరువాత ఇది మూడవసారి గణతంత్ర వేడుకలను నిర్వహించడం. వేడుకల సందర్భంగా జిల్లా ప్రగతిని కలెక్టర్ హిమాన్షు శుక్లా చదివి వినిపించనున్నారు. వివిధ ప్రభుత్వ శాఖలు తమ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ శకటాలను రూపొందించాయి. జిల్లా పోలీసులు ప్రత్యేక కవాతును, చిన్నారులు, విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ చూపిన అధికారులకు అవార్డులు అందజేయనున్నారు. గణతంత్ర వేడుకల సందర్భంగా కలెక్టరేట్‌తోపాటు పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలను విద్యుదీపాలాంకరణ, రంగురంగు జెండాలతో ముస్తాబు చేశారు.

ఆలయ ప్రాంగణానికి చేరుకున్న రథం



షెడ్డు నుంచి రథాన్ని బయటకు తీస్తున్న అధికారులు, అగ్నికుల క్షత్రియులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని దేవస్థానంలో గురువారం స్వామివారి రథాన్ని షెడ్డు నుంచి ఆలయ ప్రాంగణంలోకి చేర్చారు. ఏడాది పొడవునా షెడ్డులో భద్రపరచిన స్వామివారి రథాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు నేతృత్వంలో పల్లిపాలెం అగ్నికుల క్షత్రియులు షెడ్డు నుంచి బయటకు తీసుకు వచ్చారు. వచ్చే నెల 16 నుంచి 25వ తేదీ వరకూ క్షేత్రంలో జరిగే స్వామివారి వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాల్లో స్వామివారి రథాన్ని రథోత్సవానికి సిద్ధం చేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఆలయ అర్చకుడు పి.రామశేషాచార్యులు, పల్లిపాలెం సర్పంచ్ ఒడుగు శ్రీను, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలికి సత్కారం



వృద్ధురాలిని సత్కరిస్తున్న వైస్ ఎంపీపీ లలిత

తాళ్లరేవు: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని 107 ఏళ్ల వృద్ధురాలు కొపనాతి మహాలక్ష్మిని వైస్ ఎంపీపీ కె.లలిత తదితరులు ఘనంగా సత్కరించారు. కోరంగి పంచాయతీ బొడ్డుచిన వెంకటాయపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు ప్రాధాన్యతను తెలియజేసి శతాధిక వృద్ధురాలిని దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. స్కూల్ హెచ్‌ఎం కేఆర్‌కే సాయిప్రసాద్, పీడీ లంకే చంద్రావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిజరూపంలో సత్యదేవుని దర్శనం

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుడు, దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి, శంకరుడు ఏ విధమైన ఆభరణాలూ లేకుండా భక్తులకు గురువారం నిజరూప దర్శనం ఇచ్చారు. వేలాదిగా భక్తులు సత్యదేవుని నిజరూప దర్శనం చేసుకుని పులకించారు.

ఆరు సబ్జెక్టులు.. ఏడు పరీక్షలు

- ఈ ఏడాది పది పబ్లిక్ పరీక్షల్లో స్వల్ప సంస్కరణ
- గతేడాది 11 నుంచి ఆరు పేపర్లకు కుదింపు
- ప్రతి సబ్జెక్టుకు 100 వంతున మార్కులు



రాయవరం: పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు ప్రభుత్వం పరీక్షల విధానంలో సమూల మార్పులు చేపట్టింది. గత విద్యా సంవత్సరంలోనే భారీ మార్పులకు శ్రీకారం చుట్టగా, ఈ ఏడాది పది పరీక్షల విధానంలో స్వల్ప మార్పులు చేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాశాఖలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. మనబడి నాడు-నేడు, జగనన్న అమ్మ ఒడి, ఒకటో తరగతి నుంచే ఇంగ్లిషు మీడియం, సీబీఎస్‌ఈ, పాఠశాలల్లోనే జూనియర్ కళాశాలల ఏర్పాటు ఇలా పలు నూతన సంస్కరణలకు నాంది పలికారు. నూతన సంస్కరణల్లో భాగంగా తాజాగా పది పబ్లిక్ పరీక్షల్లో చేపట్టిన సంస్కరణల్లో భాగంగా ఈ ఏడాది ఆరు సబ్జెక్టులను ఏడు పేపర్లుగా నిర్వహిస్తున్నారు. సీబీఎస్ఈ తరహాలోనే పబ్లిక్ పరీక్షలు నిర్వహించే క్రమంలో భాగంగా పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను గత విద్యా సంవత్సరంలో ఆరు పేపర్లకు కుదించారు. ఈ విద్యా సంవత్సరం ఆరు సబ్జెక్టులను ఏడు పేపర్లుగా నిర్వహించాలని విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీని ద్వారా పబ్లిక్ పరీక్షలు ఏ విధానంలో నిర్వహిస్తారనే గందరగోళానికి ఫుల్‌స్టాప్ పెట్టడం ప్రభుత్వం ముందుచూపునకు, విద్యపట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనంగా చెప్పవచ్చు.

గతంలో ఇలా..

పదవ తరగతిలో గత కొన్నేళ్లుగా 11 పేపర్లను నిర్వహించేవారు. హిందీ మినహా తెలుగు, ఇంగ్లిషు, గణితం, సోషల్ సబ్జెక్టుల్లో ప్రతి సబ్జెక్టుకు 50 మార్కుల వంతున రెండు పేపర్లు నిర్వహించేవారు. సైన్సులో ఫిజికల్ సైన్స్, బయాలజీ సబ్జెక్టుకు 50 మార్కుల వంతున రెండు పేపర్లు ఉండేవి. ఒక్కో పరీక్షను ఒక్కో రోజు వంతున 11 రోజుల పాటు పరీక్షలు నిర్వహించేవారు. కరోనా ప్రభావంతో 2019-20, 2020-21 విద్యా సంవత్సరాల్లో పబ్లిక్ పరీక్షలను రద్దు చేశారు. కరోనా తీవ్రత తగ్గడంతో 2021-22 విద్యా సంవత్సరంలో పబ్లిక్ పరీక్షలు నిర్వహించగా, 11 పేపర్లను ఏడు పేపర్లకు కుదించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిషు, గణితం, సోషల్ సబ్జెక్టులకు ఒక్కో పేపరుకు 100 మార్కులకు వంతున పరీక్ష నిర్వహించగా, ఫిజికల్ సైన్స్, బయాలజీ పేపర్లను ఒక్కో పేపరును 50 మార్కుల వంతున నిర్వహించారు. 2022-23 విద్యా సంవత్సరంలో పది పబ్లిక్ పరీక్షలను ఆరు పేపర్లకు కుదించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిషు, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లో ఒక్కో సబ్జెక్టుకు 100 మార్కులకు పేపరు నిర్వహిస్తున్నారు. సైన్స్ సబ్జెక్టులో మాత్రం ఫిజికల్ సైన్స్, బయాలజీ సబ్జెక్టులకు సంబంధించి ఒకే ప్రశ్నపత్రం ఇస్తారు. అయితే జవాబులు మాత్రం వేర్వేరు సమాధాన పత్రాల బుక్‌లెట్స్‌లో రాయాల్సి ఉంటుంది. పీఎస్, బయాలజీ జవాబు పత్రాలను సంబంధిత ఉపాధ్యాయులు మూల్యాంకనం చేయడానికి వీలుగా ఇలా వేర్వేరు జవాబు పత్రాల్లో రాయిస్తారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించి, పరీక్షల పట్ల ఉన్న భయాన్ని పోగొడుతుందని విద్యావేత్తలు భావిస్తున్నారు. 2024-25 విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ విధానంలో నిర్వహించే పరీక్షలకు ఇప్పటి నుంచే బాటలు వేసినట్లవుతుంది.

ప్రస్తుత విద్యా సంవత్సరంలో..

ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆరు సబ్జెక్టుల పేపర్లకు ఏడు పరీక్షలు నిర్వహిస్తున్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిషు, గణితం, సోషల్ సబ్జెక్టులను వంద మార్కుల వంతున నిర్వహిస్తున్నారు. సైన్స్ పేపరును మాత్రం రెండు పరీక్షలుగా నిర్వహిస్తున్నారు. ఫిజికల్ సైన్స్ 50 మార్కులకు, బయలాజికల్ సైన్స్ పేపరు 50 మార్కులకు నిర్వహిస్తున్నారు. పరీక్షా సమయాన్ని కూడా ప్రభుత్వం మార్పు చేసింది. గతంలో ఈ సమయం మూడు గంటలు ఉండగా, ఇప్పుడు 15 నిమిషాలు వ్యవధిని పెంచారు. ఈ 15 నిమిషాల నిడివిలో ప్రశ్నపత్రం చదవడానికి, రాసిన సమాధానాలు సరిచూసుకోవడానికి కేటాయించాలనే ఉద్దేశంతో ఈ మార్పు చేశారు. గతేడాది పరీక్షకు పరీక్షకు మధ్య ఒక రోజు గడువు ఉండగా, ఈ ఏడాది వరుసగా రోజుకొక పరీక్షను నిర్వహిస్తున్నారు.

పది పరీక్షల టైమ్ టేబుల్

తేది	సబ్జెక్టు	మార్కులు	సమయం
మార్చి 18	తెలుగు	100	9.30-12.45
	కాంపోజిట్ కోర్సు	70	9.30-12.45
మార్చి 19	హిందీ	100	9.30-12.45
20	ఇంగ్లిషు	100	9.30-12.45
22	గణితం	100	9.30-12.45
23	పీఎస్	50	9.30-11.30
26	బీఎస్	50	9.30-11.30
27	సోషల్	100	9.30-12.45
28	కాంపోజిట్ కోర్సు	30	9.30-11.15

అవసరమైన చర్యలు



పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఏడు పేపర్ల విధానాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఆరు సబ్జెక్టులకు ఏడు పేపర్లు నిర్వహిస్తున్నారు. 2024-25లో సీబీఎస్ఈ విధానంలో పది పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులు సైన్స్ పరీక్ష విషయంలో గందరగోళానికి గురవకూడదనే సైన్స్ పరీక్షను వేర్వేరు రోజుల్లో ప్రభుత్వం నిర్వహిస్తోంది.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం.

దళితుల కోసం రూ.62 వేల కోట్ల ఖర్చు

ఎస్సీ కమిషన్ సభ్యుడు ఆనంద్ ప్రకాష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ కమిషన్ సభ్యుడు ఆనంద్ ప్రకాష్

అమలాపురం రూరల్: నాలుగున్నర సంవత్సరాల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం దళితుల సంక్షేమం కోసం రూ.62 వేల కోట్లు ఖర్చు చేసిందని, దళిత వర్గాలకు సబ్ ప్లాన్ సజావుగా అమలు జరుగుతోందని ఎస్సీ కమిషన్ సభ్యుడు చల్లం ఆనంద్ ప్రకాష్ తెలిపారు. గురువారం అమలాపురం మండల పరిషత్ కార్యాలయంలో మండల ఎస్సీ సర్పంచులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ కమిషన్ సభ్యుడు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రభుత్వ పాఠశాలలో అంగ్లం ప్రవేశపెట్టి నాడు- నేడు ద్వారా పాఠశాలను అభివృద్ధి చేసిందని అన్నారు. చంద్రబాబు పాలనలో దళితులకు కేవలం రూ.27వేల ఖర్చు చేశారని, జగన్ ప్రభుత్వంలో రూ.62 వేల కోట్లు ఖర్చు చేశారని అన్నారు. సంక్షేమ పథకాలు సజావుగా అందుతున్నదీ లేనిదీ కమిషన్ పరిశీలిస్తుందని, పథకాల అమలులో ఎవరైనా వివక్షకు గురవుతున్నారా అనే అంశాలపై కమిషన్ దృష్టి సారిస్తుందన్నారు. బండారులంక గ్రామ సచివాలయాన్ని సందర్శించానని, వలంటీర్ల ద్వారా అమలు జరుగుతున్న కార్యక్రమాల తీరును అడిగి తెలుసుకున్నానని చెప్పారు. గ్రామ సచివాలయ ఉద్యోగస్తులు సంతృప్తికరమైన సమాధానం ఇచ్చారని ఆనంద్ ప్రకాష్ తెలిపారు. తిరుపతి, వైజాగ్ లాంటి కేంద్రాల్లో ఎస్సీ ఎస్టీ యువత కోసం స్టడీస్ సర్కిల్ ద్వారా సాధారణ పోటీ పరీక్షలతోపాటు ఐఏఎస్ లాంటి ఉన్నత స్థాయి ఉద్యోగాలకు వెళ్లడానికి శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రతి జిల్లా, రెవెన్యూ, డివిజన్, మండల కేంద్రాల్లో పౌర హక్కుల దినోత్సవం సమావేశాలు తప్పనిసరిగా నిర్వహిస్తుండాలన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి జ్యోతిలక్ష్మీదేవి, ఎంపీడీవో జె. వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ పాలమూరి బాలకృష్ణ, దళిత జేఏసీ కన్వీనర్ జంగా బాబూరావు, సర్పంచ్‌లు నక్కా అరుణకుమారి, దాసరి అరుణ, పందిరి విజయ, తిరుకోటి సుజాత పాల్గొన్నారు.

విద్యా సాధికారత జగన్‌తోనే సాకారం

జిల్లా వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం ర్యాలీలో మంత్రి విశ్వరూప్



అమలాపురంలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న అనేక పథకాలతో విద్యార్థులు సాధికారత సాధిస్తున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా శాఖ అధ్యక్షుడు మిండగుదటి శిరీష్ ఆధ్వర్యంలో అమలాపురంలో గురువారం ఉదయం జరిగిన విద్యార్థుల సాధికారత ర్యాలీని మంత్రి విశ్వరూప్ ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థుల సాధికారత జగనన్నతోనే సాధ్యం అనే అంశంతో ఈ ర్యాలీ స్థానిక హైస్కూలు సెంటర్ నుంచి ప్రారంభమై నల్ల వంతెన వరకూ రెండు కిలోమీటర్ల మేర సాగింది. హైస్కూలు సెంటర్‌లో గల మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీనీ ప్రారంభించారు. నల్లవంతెన వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీని ముగించారు. పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా జగన్ చేసిన విద్యా సంస్కరణలు నేడు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వింటి రాజా, రాష్ట్ర కార్యదర్శి రమేష్ జిల్లెళ్ల, ఉభయ గోదావరి జిల్లాల కో ఆర్డినేటర్ నీలి ఆనంద్, జిల్లా ఉపాధ్యక్షుడు మట్టపర్తి మణికుమార్, ప్రధాన కార్యదర్శులు సత్తి శ్రీరామ్, గొల్లపల్లి బాబి ప్రసంగించారు. ముఖ్యమంత్రి జగన్ వల్లే నేడు విద్యాలయాలు నాడు-నేడుతో రూపు రేఖలు మారి కొత్త పుంతలు తొక్కుతున్నాయని వారు గుర్తు చేశారు. ర్యాలిలో అమలాపురం జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్, కౌన్సిలర్ గొవ్వాల రాజేష్, పార్టీ నాయకుడు వంటెద్దు వెంకన్నాయుడుతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరగా భవనాల పూర్తి

సాక్షి అమలాపురం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ సెంటర్లు, బల్క్ మిల్క్ యూనిట్‌ల నిర్మాణాలను జిల్లాలో త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి అమరావతి నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ నుంచి కలెక్టర్ హిమాన్షు శుక్లాతో పాటు పలు శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జిల్లాలో రెవెన్యూ ఈనాం భూములు, అసైన్డ్ భూములపై ఉచిత హక్కుల కల్పన, మూడో దశ సర్వే, నరేగా ద్వారా సరాసరి వేతనాలు, పని దినాల కల్పన, సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధత అంశాల పురోగతిపై జిల్లాల వారీగా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ శుక్లా స్థానికాధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలన్నింటిని త్వరగా పూర్తిచేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా నవరత్నాలు, పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చిన వివరాలను సరిహద్దులు సర్వే నంబర్లతో డేటా రూపొందించాలని ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన బదిలీలు, లాజిస్టిక్స్ అవసరాలు, వాహనాల అవసరాలు, పోలింగ్ కేంద్రాలలో కనీస సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలన్నారు. పోలీస్, అటవీ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టుల వద్ద నగదు, మద్యం, గిఫ్ట్ ఆర్టికల్స్ బల్కుగా రవాణా కాకుండా దృష్టి సారించాలన్నారు.

వ్యవసాయశాఖ అధికారుల డైరీ ఆవిష్కరణ

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ అధికారుల అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం చిరుధాన్యాల వంటకాలపై ప్రచురించిన పుస్తకాన్ని కూడా ఆయన ఆవిష్కరించారు. జేసీ ఎస్.నుపూర్ అజయ్, డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, సీపీవో వెంకటేశ్వర్లు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ ప్రభాకర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎ.బోసు బాబు, సచివాలయాల నోడల్ అధికారి భీమేశ్వర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్.ఎన్.వి.కృష్ణారెడ్డి, డీఈవో కమల కుమారి, డీపీవో కృష్ణకుమారి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, డీఎఅండ్‌హెచ్‌వో ఎం.దుర్గారావు దొర, డీసీహెచ్ పద్మశ్రీ రాణి పాల్గొన్నారు.

వేదోద్ధరణతోనే సమాజ శ్రేయస్సు

అమలాపురం విద్వత్సభలో వేద ఘనపాఠీల ఉద్బోధ

అమలాపురం టౌన్: వేదోద్ధరణతోనే సమాజ శ్రేయస్సు సిద్ధిస్తుందని శృంగేరి ఆస్థాన విద్వాంసులు విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి ఉద్ఘోషించారు. శ్రీపాద శ్రీరామ నృసింహ ఘనపాఠీ ట్రస్ట్ 24వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక సరస్వతీ నగర్‌లో గురువారం జరిగిన విద్వత్సభలో నృసింహ ఘనపాఠీ ఉపన్యసించారు. విద్వత్సభ కార్యదర్శి డాక్టర్ బులుసు వ్యాఘ్రేశ్వరుడు అధ్యక్షతలో జరిగిన ఈ సభకు హైదరాబాద్‌కు చెందిన వేద పండితులు దెందుకూరి వేంకటేశ్వరపాండరీకయాజులు అధ్యక్షత వహించారు. రాజమహేంద్రవరం వేద పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుళ్లపల్లి సీతారామచంద్ర ఘనపాఠీ మాట్లాడుతూ నృసింహ ఘనపాఠీ వేద సామర్థ్యం గురించి సభకు వివరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 90 మంది వేద ఘనపాఠీలు హాజరైన ఈ సభలో



వేద స్వస్తి చెబుతున్న ఘనపాఠీలు

ఉదయం వేద స్వస్తి, మధ్యాహ్నం ఘన స్వస్తి జరిగాయి. మానవ మనుగడకు వేదాలు మూల స్తంభాలని, వేదాలే నేడు లోకాన్ని నడిపిస్తున్నాయని ఘనపాఠీలు తమ ఉపన్యాసాల్లో ఉద్ఘాటించారు. వేద ఘనపాఠీలు కడియాల సీతారామ ఘన పాఠీ, విశాఖపట్నం కనక మహాలక్ష్మి దేవస్థానం విద్వాంసులు ముష్టి వేంకటేశ్వర ఘనపాఠీ, విజయవాడ కనకదుర్గ దేవస్థానం ఆస్థాన విద్వాంసులు ఉపాధ్యాయుల సుబ్రహ్మణ్య ఘనపాఠీ, తెలంగాణ రాష్ట్ర వేద పరీక్షాధికారి గంగాధర కేదార ఘనపాఠీ, తిరుపతి వేద విశ్వ విద్యాలయ ప్రతినిధి జొన్నవిత్తుల చంద్రశేఖర ఘనపాఠీ, టీటీడీ సూపర్‌వైజర్ గుళ్లపల్లి చిన ఆంజనేయఘనపాఠీ, అన్నవరం దేవస్థాన వేద పండితులు సుబ్రహ్మణ్య ఘనపాఠీ, తిరుపతి వేద పండితులు రెండుచింతల యజ్ఞనారాయణ ఘనపాఠీ తదితర వేద వేదాంగ పండితులు ఈ విద్వత్సభకు హాజరై వేదాల పరమార్థాలను వివరించారు. లోక కల్యాణం కోసం వేదాశీర్వాదం చేశారు. విద్వత్సభ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్ఎస్ఆర్ మూర్తి, సభ ప్రతినిధులు వెంకటరమణ లక్ష్మీపతిశాస్త్రి, డాక్టర్ మంగళపల్లి అరుణ్ కుమార్, కోనసీమ వేద శాస్త్ర సభ కార్యదర్శి గుళ్లపల్లి వెంకట్రామ్‌తో పట్టణ ప్రముఖులు, వేదాభిమానులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో రుణమాఫీ చేసిన ఘనత జగనన్నదే

- మంత్రి విశ్వరూప్
- గొల్లవిల్లిలో ఆసరా సంబరాలు

ఉప్పలగుప్తం: పాదయాత్రలో మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో పూర్తిగా డ్వాక్రా రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదే అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ దంగేటి వీరఅచ్యుత జానకీ అధ్యక్షతన నిర్వహించిన వైఎస్సార్ ఆసరా నాలుగో విడత కార్యక్రమంలో గురువారం మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో చంద్రబాబు డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ చేస్తానని హామీ ఇచ్చి ఎన్నికలకు నెల ముందు రూ.10వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. సీఎం జగన్ ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం దాదాపుగా రూ.6,400 కోట్ల రుణమాఫీ చేశారన్నారు. ఒక్క ఉప్పలగుప్తం మండలంలో 2019 ఎన్నికల నాటికి ఉన్న అప్పు భారాన్ని నాలుగు విడతల్లో రూ.36.837 కోట్లు తీర్చి మహిళలను ఆదుకున్నారన్నారు. ఎన్నికల కోసమే వాగ్దానాలు ఇవ్వటం చంద్రబాబుకు అలవాటని, ఇచ్చిన హామీలకు కట్టుబడి నెరవేర్చేది సీఎం జగన్ మాత్రమే అని వివరించారు. ఏదోక రూపంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమాలు ప్రతీ ఇంటిలోనూ సీఎం జగన్ పరిపాలనలో చేకూరతున్నాయన్నారు. ఇప్పటి వరకు సీఎం జగన్ పరిపాలనలో దాదాపుగా రూ.2.50 లక్షల కోట్లు లబ్ధి పేదలకు ఎక్కడా లంచం లేకుండా చేకూరిందన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలతో కలసి నాలగవ విడత మంజూరైన రూ.9.20 కోట్ల నమూనా చెక్కును మంత్రి విశ్వరూప్ ఆవిష్కరించారు. ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి, జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపద రావు, వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి, సర్పంచ్‌లు జొన్నాడ శ్రీదుర్గ, కడిమి చిన్నవరాజు, పెయ్యల రాజ్‌కుమార్, కుంచే బుల్లియ్య, ఇసుకపట్ల జయమణి, ఎంపీటీసీ సభ్యులు వంగా గిరిజాకుమారి, కొంకి ఏడుకొండలు, కాత్రు ధనలక్ష్మి, వైఎస్సార్ హార్టి కల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ బడుగు మేరీకుమారి, డైరెక్టర్ చప్పిడి దుర్గారావు, రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బడుగు గణేష్, వ్యవసాయ మండలి మండల చైర్మన్ మానే శ్రీను, జగనన్న సేవాదళ్ జిల్లా కార్యదర్శి పెయ్యల రమణ, సొసైటీ అధ్యక్షుడు దంగేటి దొరబాబు పాల్గొన్నారు.



గొల్లవిల్లిలో వైఎస్సార్ ఆసరా నాలుగవ విడత చెక్కును అందిస్తున్న మంత్రి విశ్వరూప్

ఓటుకు నోటు.. ప్రజాస్వామ్యానికి చేటు



సీనియర్ ఓటర్లను సత్కరించిన కలెక్టర్ శుక్లా, ఎస్పీ శ్రీధర్, జేసీ నుపూర్ అజయ్

అమలాపురం రూరల్: ఓటుకు నోటు భవిష్యత్తుకు, ప్రజాస్వామ్యానికి చేటని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు ద్వారా నాయకత్వ లక్షణాలు గల వారిని ఎంపిక చేసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా యువ ఓటర్లకు పిలుపునిచ్చారు. గురువారం అమలాపురం భట్లపాలెం బీవీసీ కళాశాలలో 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటింగ్ సమయంలో 13 రకాల గుర్తింపు కార్డులను చూపి ఓటు హక్కును వినియోగించుకోవచ్చునన్నారు. ఎస్పీ ఎస్.శ్రీధర్ ప్రసంగిస్తూ ఎన్నికలు అనేవి ప్రజల సార్వభౌమాధికారానికి గుర్తు అని అన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ మాట్లాడుతూ రంగోలి ముగ్గుల పోటీల్లో విద్యార్థులు చక్కని సందేశం అందించారన్నారు. తొలుతగా ఓటరు దినోత్సవ ర్యాలీని ప్రారంభించారు. సీనియర్ ఓటర్లను సత్కరించి కొత్తగా నమోదైన ఓటర్లకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. రంగోలి, వ్యాసరచన వక్తృత్వపు పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఆర్డీవో జి.కేశవవర్ధన్‌రెడ్డి, అడ్మిన్ ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, మున్సిపల్ కమిషనర్ వీఐపీ నాయుడు, డీఎస్పీ అంబికాప్రసాద్, ప్రిన్సిపాల్ జేవిజే రామారావు, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని నాని పాల్గొన్నారు.

5, 6 తేదీలలో 'నన్నయ'లో గిరిజన సాంస్కృతిక ఉత్సవాలు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో వచ్చే నెల 5, 6 తేదీలలో జాతీయ స్థాయి గిరిజన సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను వీసీ ఆచార్య కె.పద్మరాజు గురువారం విడుదల చేశారు. ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ ఉత్సవాలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర, స్థానిక ఎమ్మెల్యే జక్కంపూడి రాజాతోపాటు పలువురు గిరిజన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని నిర్వాహకులు అక్కులప్ప నాయక్ తెలిపారు. కార్యక్రమంలో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణు నాయక్, రాజ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ దొర, జాన్ వెస్లీ, చిన్న పాల్గొన్నారు.

పరీక్షల ఒత్తిడి... భయంతోనే ఆత్మహత్య

కాకినాడ రూరల్: రంగరాయ వైద్య కళాశాల ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ విద్యార్థిని కాకినాడ రంగయ్యనాయుడు వీధికి చెందిన వంకదారి శ్వేత(25) ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. కాకినాడ రూరల్ నేమాం బీచ్‌లో బుధవారం సాయంత్రం శ్వేత మృతదేహం లభ్యమైన విషయం విదితమే. ఫైనల్ ఇయర్ ప్రాక్టికల్ పరీక్ష కోసం జీజీహెచ్ వద్ద బుధవారం శ్వేతను తండ్రి కుబేరరావు దింపి తిరిగి తీసుకువెళ్లేందుకు సాయంత్రం వచ్చేసరికి పరీక్షకు హాజరు కాలేదని తెలుసుకుని కంగారు పడ్డారు. ప్రాక్టికల్ పరీక్ష హాలులో గతంలో రెండుసార్లు కళ్లు తిరిగి పడిపోయిన శ్వేత పరీక్ష భయం, ఒత్తిడి కారణంగా ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని తల్లిదండ్రులు, సోదరుడు తెలియజేసినట్టు తిమ్మాపురం ఎస్సై షేక్ షరీఫ్ తెలిపారు. మానసిక పరిస్థితి బాగోకపోవడంతో సైక్రియాటిస్ట్ వద్దకు వెళదామంటే తానే డాక్టరునని చెప్పేదని తండ్రి వివరించారని ఎస్సై తెలిపారు. తోటి విద్యార్థినులను విచారించగా పరీక్షల భయంతో శ్వేత ఒత్తిడికి గురయ్యేదని తెలిపారని ఎస్సై తెలియజేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు.

గాలికుంటు టీకా.. భయం లేదిక

- పశువుల సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- వ్యాధి నివారణకు ఉచితంగా టీకాలు
- ఇప్పటికే 70 శాతం పూర్తి



పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్న సిబ్బంది



వ్యాధి కారణంగా గిట్టలో ఏర్పడిన పుండ్లు

కాకినాడ సిటీ: పశువుల సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అనేక వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో నివారణకు ప్రణాళిక రూపొందించింది. ప్రస్తుతం గాలికుంటు వ్యాధి నివారణకు ఉచితంగా టీకాలు వేయిస్తోంది. ఇప్పటికే ఈ కార్యక్రమం 70 శాతం పూర్తయ్యింది. వైరస్ కారణంగా గాలికుంటు వ్యాధి ఆశిస్తుంది. చీలిన గిట్టలున్న పశువులలో మాత్రమే కనిపిస్తుంది. పికార్న వైరస్ కారణంగా ఇది వస్తుంది. ఈ వైరస్‌లో ఓఏసీ, ససియా 1, సాట్ 1, సాట్ 2, సాట్ 3 వంటి రకాలున్నాయి. సాధారణంగా జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో పశువులకు గాలి ద్వారా వ్యాపిస్తుంది. దేశవాళీ పశువుల కంటే సంకరజాతి పశువులకు ఎక్కువ నష్టం కలగజేస్తుంది. గాలికుంటు వ్యాధి బారిన పడిన తల్లి పశువు పాలు తాగితే దూడలు మృత్యువాత పడతాయి. ఈ నేపథ్యంలో గేదెలు, ఆవులు, ఎద్దులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంది. ఈనెల 31వ తేదీ వరకు జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద గ్రామాల్లో ఉన్న ప్రతి పశువుకూ ప్రభుత్వం ఉచితంగా టీకాలు వేస్తోంది.

వ్యాధిపై అప్రమత్తం

గాలికుంటు వ్యాధి సోకిన ఆవులు, ఎద్దులు, గేదెల శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 105 డిగ్రీలకు పెరుగుతుంది. పశువు నోట్లో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. ఆహారం సరిగా తీసుకోలేవు. నీరసంగా మారి నడిచేందుకు ఇబ్బంది పడతాయి. వ్యాధి నివారణ కోసం వైద్యులు సూచన మేరకు యాంటీబయోటిక్స్, పెయిన్ కిల్లర్స్ మందులు వాడాల్సి ఉంటుంది. ఈ వ్యాధి కలిగించే వైరస్ క్రిములు పశువు పేడ, నీరుడు, పొంగు, వీర్యం, పాలు, పుండ్ల నుంచి బయటకు

పాడి-పంట

వచ్చి, మరో పశువుకు నీరు, గాలి, మేత ద్వారా వ్యాప్తి చెందుతాయి.

లక్షణాలు ఇవే..

- జ్వరం 104 నుంచి 106 డిగ్రీలు ఫారన్ హీట్ ఉంటుంది. పశువు మేత మేయదు, నెమరు వేయదు, నోటిలో బొబ్బలు పగిలి చొంగకారుతుంది. కాలిగిట్టల మధ్య బొబ్బలు ఏర్పడి పుండ్లుగా మారి పశువులు కుంటుతాయి. పనిచేసే పశువుల శక్తి నశిస్తుంది.
- పాలిచ్చే పశువులలో రొమ్ములపైనా, పొదుగుదలపైనా బొబ్బలు ఏర్పడి పొదుగు వాపునకు గురవుతుంది. ఆడ పశువు గర్భధారణ శక్తి కోల్పోతుంది. మేకలు, గొర్రెలు, పందులకు కూడా గాలికుంటు వ్యాధి వస్తుంది.

నివారణా చర్యలు

- వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి. పశువుల శాలను 5 శాతం క్రెసాల్ నీటితో కడగాలి. వ్యాధి ఆశించిన గ్రామాల్లో జరిగే సంతలకు పశువులను తీసుకెళ్లకూడదు.
- ఆరోగ్యంగా ఉన్న పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకా మొదటిసారి 2 నెలల వయసులో వేయించాలి. బూస్టర్ డోసు ఒక మాసం తర్వాత వేయించాలి. ఆ తరువాత క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం టీకా వేయించాలి.
- టీకా మందు మోతాదు 2 ఎంఎల్ ఇవ్వాలి. టీకా వేసిన తరువాత 1 నుంచి 3 వారాలలో పశువుల్లో వ్యాధి నిరోధకశక్తి పెంపొందుతుంది. తద్వారా ఈ వ్యాధి సోకకుండా ఉంటుంది.
- పశువులకు ఈనిన తరువాత టీకాలు వేయించాలి. కలుషితమైన దాణా, మేతలను తగలబెట్టాలి.
- వ్యాధి సోకిన ఆబోతులు, దున్నలను సంపర్కానికి వినియోగించకూడదు. పాలను మరగకాచి మాత్రమే మనుషులు వినియోగించాలి.
- గాలికుంటు ఆశించిన పశువు పాలను తాగితే లేగదూడలు చనిపోతాయి. వ్యాధితో మృతి చెందిన పశువుల కళేబరాన్ని లోతైన గొయ్యి తీసి అందులో సున్నం వేసి పాతిపెట్టాలి. లేదా కాల్చివేయాలి. తద్వారా గాలికుంటు వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చు.

కాకినాడ జిల్లాలో పశువులు

ఆవులు	:	76,502
గేదెలు	:	2,82,273
గొర్రెలు	:	1,41,229
మేకలు	:	1,01,870

టీకాతో నివారణ



గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. గతంలో ఎన్నడూ లేని విధంగా జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా ప్రత్యేక టీకా కార్యక్రమం ప్రారంభించింది. గ్రామాలలో పాడి రైతులు తమ ఆవులు, ఎద్దులు, గేదెలకు తప్పకుండా గాలికుంటు టీకా వేయించాలి. ఈ వ్యాధి సోకితే రైతులు ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఎక్కువగా ఉంది. ఇప్పటి వరకు 70 శాతం పశువులకు టీకాలు వేశాం. ఈనెల 31వ తేదీ వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుంది. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకూ టీకా వేయించాలి. పశువులకు ఈ వ్యాధి లక్షణాలు ఉంటే ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలకు సమాచారం ఇవ్వాలి.

– ఎస్ సూర్యప్రకాశరరావు, కాకినాడ జిల్లా సంయుక్త సంచాలకులు

చిత్తడి నేలలు సాంస్కృతిక వారధులు

ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ తదితరులు

కాకినాడ సిటీ: చిత్తడి నేలలు సాంస్కృతిక వారధులుగా నిలుస్తాయని శాసన మండలి సభ్యురాలు కర్రి పద్మశ్రీ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్, అటవీశాఖ, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు చిత్తడి నేలల సంరక్షణ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం సాలిపేట పైండా సత్తిరాజు బాలికల మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో జరిగిన ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా మానివేయాలని, పర్యావరణహితమైన అలవాట్లను అవలంబించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సామాజిక వనాలను అభివృద్ధి చేయాలన్నారు. ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, జిల్లా విద్యాశాఖాధికారి జి.నాగమణి మాట్లాడుతూ చిత్తడి నేలలు తుపానులు, సునామీల నుంచి రక్షిస్తాయన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ డైరెక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా సమన్వయ కర్త కేవీకే మహేశ్వరరావు మాట్లాడారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కాకినాడ ఉప విద్యాశాఖ అధికారి ఆర్‌జే డేనియల్ రాజు, జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్, మండల విద్యాశాఖ అధికారులు వీపీజీ వాణికుమారి, సీహెచ్ రవి, పాఠశాల ప్రధానోపాధ్యాయిని జె.సుబ్బలక్ష్మి, బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా అకడమిక్ సమన్వయకర్త కె.వెంకట్రావు, ఎం. వెంకట శివరామకృష్ణ, గ్రీన్‌కోర్ ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

1.98 కోట్ల మంది కులగణన పూర్తి

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కులగణన ప్రక్రియ చేపట్టిన వారం రోజుల్లో 89 లక్షల కుటుంబాల్లోని 1.98 కోట్ల మంది కులగణన పూర్తిచేశామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. ప్రతి పదేళ్లకూ జరిగే జనగణనలో కులగణనను కూడా చేర్చాలని అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేయించి కేంద్ర ప్రభుత్వం ఆమోదానికి పంపామని తెలిపారు. గురువారం రాజమహేంద్రవరం 18వడివిజన్ కప్పల వారి వీధిలో గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో పర్యటించిన ఆయన కులగణన ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు గోపాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని కులాల వారి జీవన స్థితిగతులు, విద్య ఆర్థిక సామాజిక స్థితిగతులతో సమగ్ర సమాచారం కూడిన డేటాను సేకరించేందుకు కులం గణన ప్రక్రియను ప్రారంభించుకున్నామన్నారు. సామాజిక న్యాయాన్ని గడచిన పాలకులు ఎండమావిగా చేస్తే నేడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సామాజిక న్యాయ శిల్పం ఆవిష్కరణ రోజైన జనవరి 19న కులగణన ప్రక్రియను ప్రారంభించారని పేర్కొన్నారు. సామాజిక న్యాయానికి చిరునామా ఆంధ్రప్రదేశ్ అని పేర్కొన్నారు. ఈ నెల 29 తేదీ నాటికి కులగణన ప్రక్రియ పూర్తవ్వాలనే లక్ష్యంగా నిర్ణయించామన్నారు. అవసరం మేరకు మరో పది రోజులు పొడిగిస్తామన్నారు.



కులగణన ప్రక్రియను పరిశీలిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

కడియం నర్సరీలతో ఒప్పందం కొనసాగింపు



వీసీ జానకిరామ్‌తో అసోసియేషన్ అధ్యక్షుడు పోలరాజు, పాలకవర్గ సభ్యులు

కడియం: తాడేపల్లిగూడెం సమీపంలో వెంకటరామన్న గూడెం వద్దనున్న డాక్టర్ వైఎస్సార్ హార్టీకల్చర్ యూనివర్సిటీతో కడియం ప్రాంత నర్సరీల ఒప్పందం మరో మూడేళ్ల పాటు కొనసాగనుంది. ఈ మేరకు సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు, యూనివర్సిటీ వీసీ టి.జానకిరామ్ గురువారం ఈ మేరకు వర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒప్పందంలో భాగంగా సాంకేతిక సహాయం, నూతన వంగడాల ఉత్పత్తికి తోడ్పాటు తదితర అంశాల్లో యూనివర్సిటీ, నర్సరీలు కలిసి పనిచేయనున్నాయి. గతంలో మూడేళ్లకు కుదిరిన ఒప్పందాన్ని మరో మూడేళ్ల పాటు పొడిగించామని ఈ సందర్భంగా నర్సరీ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు విలేకరులకు తెలిపారు. సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంపై నర్సరీ రైతులకు అవగాహన, విదేశీ వాణిజ్యంలో పోటీకి తగిన విధంగా రైతులను సిద్ధం చేయడం తదితర అంశాల్లో రైతులకు యూనివర్సిటీ అండగా ఉంటుందన్నారు. వర్సిటీ సిబ్బంది, అసోసియేషన్ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కట్టిపడేసిన నాటికలు



ఇంద్రప్రస్థం' నాటికలోని సన్నివేశం

పెద్దాపురం: మండలంలోని చంద్రమాంపల్లిలో స్నేహా ఆర్ట్స్ నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి పంచమ నాటక కళాపరిషత్ పోటీలు గురువారం రెండవ రోజు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. చంద్రమోహన్ కళా ప్రాంగణంలో కామ్రేడ్ యాసలపు సూర్యారావు కళావేదికపై రాత్రి నాటికల ప్రదర్శన నిర్వహించగా కళావేదికలను సాహితి స్రవంతి జిల్లా అధ్యక్షుడు జ్యోసుల కృష్ణబాబు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. నాటక పరిషత్ పోటీల్లో మూడు నాటికలను ప్రదర్శించారు. స్నేహా ఆర్ట్స్ అధ్యక్షుడు గొందేశి రాజా అధ్యక్షతన జరిగిన సభలో జ్యోస్యుల కృష్ణబాబు, పులిమేరు సొసైటీ అధ్యక్షుడు గోపు నారాయణమూర్తి, నరేష్ పెదిరెడ్డి, డి.క్రాంతికుమార్ మాట్లాడారు.

ప్రతీ ఇల్లు ఇంద్రప్రస్థంలా వెలగాలి

గురువారం మొదటి ప్రదర్శనగా 'ఇంద్రప్రస్థం' సాగింది. గుంటూరు అభినయ ఆర్ట్స్ వారి స్నిగ్ధ రచనలో ఎం.రవీంద్రరెడ్డి దర్శకత్వంలో ఈ నాటికను ప్రదర్శించారు. ప్రేమలో మునిగిపోయి తప్పులు తెలుసుకోలేనితనంతో పిల్లలు వ్యవహరిస్తే తల్లిదండ్రులు సన్మార్గంలో పెడితే ప్రతి ఇల్లు ఇంద్రప్రస్థంగా మారుతుందని తెలియజేసేలా నాటిక సాగింది.

రైతే రాజు: అరచేతిలో ఫోన్ లేకుండా బతకలేని మనం అదే అరచేతిలో పిడికెడు అన్నం లేకపోతే బతకలేమన్న సందేశాన్ని వివరిస్తూ 'రైతే రాజు' నాటిక రెండవ ప్రదర్శనగా సాగింది. కంచర్ల సూర్యప్రకాష్ రచించిన కొల్లా రాధాకృష్ణ దర్శకత్వంలో హైదరాబాద్ కళాంజలి వారు ప్రదర్శించారు.

కెరటాలు: అనాలోచిత నిర్ణయం ప్రమాదమని తెలియజేసే నాటకం 'కెరటాలు' భగవతుల రమాదేవి రచించిన కథ నుంచి గుంటూరి వారి సాయిరాఘవ మూవి మేకర్స్ ఆధ్వర్యంలో విద్యాధర్ మునిపల్లె దర్శకత్వం వహించారు.

మొక్కలతో శుభాకాంక్షలు



పల్ల వెంకన్న నర్సరీలో ఏర్పాటు చేసిన మొక్కల కూర్పు

కడియం: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ ప్రజలంతా స్వేచ్ఛాయుత జీవనాన్ని కొనసాగించాలని ఆకాంక్షిస్తూ స్థానిక పల్ల వెంకన్న నర్సరీలో మొక్కల కూర్పు ఏర్పాటు చేశారు. 75వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ కూర్పు ఏర్పాటు చేసినట్లు నర్సరీ డైరెక్టర్ పల్ల వెంకటేష్ తెలిపారు.

సినీ ఫక్కీలో నగదు దోపిడీ

పిఠాపురం: మోటారు సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని వెంబడించి, కింద పడేలా చేసి అతని దగ్గర నుంచి సినీఫక్కీలో నగదు దోపిడీ చేసిన ఘటన గొల్లప్రోలు మండలం వన్నెపూడి జంక్షన్ వద్ద చోటు చేసుకుంది. గొల్లప్రోలు పోలీసులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం గొల్లప్రోలు మండలం తాటిపర్తికి చెందిన నల్లల వీరబాబు మినపప్పు వ్యాపారం చేస్తుంటాడు. రోజూ ఆటోపై మినపప్పు లోడు పంపించి సామర్లకోట, పెద్దాపురం, జగ్గంపేటలలో దుకాణాలకు వేయించి తరువాత వెళ్లి డబ్బులు వసూలు చేసుకుంటాడు. ఎప్పటి లాగే బుధవారం మధ్యాహ్నం పెద్దాపురం, జగ్గంపేట, సామర్లకోటలలో తాను సరుకు వేసే షాపుల వద్దకు వెళ్లి డబ్బులు వసూలు చేసుకున్నాడు. తిరిగి ఇంటికి బయలుదేరిన అతను తన మోటారు సైకిల్‌పై వస్తుండగా రాత్రి 7–45 గంటల సమయంలో గొల్లప్రోలు మండలం వన్నెపూడి జంక్షన్ వద్దకు వచ్చే సరికి ఒక మోటారు సైకిల్‌పై ఇద్దరు వ్యక్తులు అతి వేగంగా వచ్చి అతనిని ఢీకొట్టే ప్రయత్నం చేయడంతో కంగారు పడిన వీరబాబు అదుపు తప్పి మోటారు సైకిల్‌తో సహా కింద పడిపోయాడు. వెంటనే అక్కడ ఆగిన వ్యక్తులు అతనిని పక్కకు గెంటి వేసి, మోటారు సైకిల్ ట్యాంకు కవరులో ఉన్న రూ.1.90 లక్షలు పట్టుకుని పరారయ్యాడు. దీంతో బాధితుడు వీరబాబు గట్టిగా కేకలు వేయగా ఆ దారిన పోయే వారు అతనిని లేపి విషయం తెలుసుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితుడు ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు ఎస్సై బాలాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు రోజూ కొనసాగిన పురోహితుల క్రికెట్ టోర్నీ



మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ షీల్డ్‌ను గోపిశర్మకు అందజేస్తున్న ఎంపీడీఓ శ్రీవెంకటాచార్య

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ పురోహిత క్రికెట్ టోర్నమెంట్ రెండు రోజైన గురువారం నిర్వహించారు. రెండోవ రోజు కొవ్వూరు జట్టుపై-భీమవరం జట్టు, అన్నవరం జట్టుపై ఖమ్మం స్థంబాద్రి జట్టు, జాగ్ లైన్స్ జట్టుపై వైజాగ్ నృసింహ లెవెన్ జట్టు, వరంగల్ వారియర్స్ జట్టు పై ఖమ్మం స్థంబాద్రి జట్టు, ఖమ్మం అయ్యప్ప సీసీ జట్టుపై గుంటూరు రాఘవ జట్టు తలపడగా కొవ్వూరు, అన్నవరం, ఖమ్మం అయ్యప్ప సీసీ, గుంటూరు రాఘవ జట్లు విజయం సాధించాయి. కొవ్వూరు జట్టులోని గోపిశర్మ మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌ను కైవసం చేసుకున్నారు. స్థానిక ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య చేతుల మీదుగా గోపి శర్మకు షీల్డ్‌ను అందజేశారు. నిర్వాహకులు కర్రా బాబి, విజయ్, గండి కోటసాయి, మహేంద్ర, అక్షయ్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.